

ఉష్ణోగ్రత: గరిష్ఠం 38.6 కనిష్ఠం 20.6

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:33 (శనివారం సాయంత్రం)
సహార్: 4:56 (ఆదివారం ఉదయం)

పది పరీక్ష.. తొలిరోజు ప్రశాంతం

మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో 99.66 శాతం విద్యార్థుల హాజరు



ధారూరు: బాలుర ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు

వికారాబాద్ జిల్లాలో 99.53 శాతం నమోదు

కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్లు గౌతమ్, ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశం

వికారాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 69 పరీక్షా కేంద్రాలకు 12,892 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 12,832 మంది హాజరయ్యారు. వివిధ కారణాలతో 60 మంది గైర్హాజరయ్యారు. తొలి రోజు 99.53 శాతం విద్యార్థుల హాజరు నమోదైంది. డీఈవో ఏడు, ఫ్లయింగ్ స్క్వాడ్లు 23 కేంద్రాలను తనిఖీ చేశారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి వేర్వేరుగా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. కలెక్టర్ జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, సెయింట్ ఆంథోనీస్, సంగం లక్ష్మీబాయి బాలికల గురుకుల పాఠశాల తదితర పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులను తనిఖీ చేసిన తర్వాతనే లోనికి అనుమతించాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి తప్పిదాలు చోటు చేసుకోకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని పరీక్ష

మిగతా 8వ పేజీలో...



దోమ: దాదాపూర్‌లో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



వికారాబాద్: పరీక్ష రాస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్



యాలాల: విద్యార్థులను పంపిస్తున్న ఎస్ఐ గిరి



ఘట్‌కేసర్‌లోని జెడ్పీ బాలికల పాఠశాల వద్ద విద్యార్థులు





మేడ్చల్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

బాధిత మహిళలకు 'భరోసా'

» మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి



వర్చువల్ ఎవిడెన్స్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అత్యాచార బాధిత మహిళలకు అండగా భరోసా కేంద్రాలు నిలుస్తాయని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం మేడ్చల్ భరోసా సెంటర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన వర్చువల్ ఎవిడెన్స్ కేంద్రాన్ని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజనతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భరోసా కేంద్రాలకు వచ్చిన బాధిత మహిళలను కౌన్సెలింగ్ ఇచ్చి న్యాయ పోరాటానికి కావాల్సిన సహకారాన్ని సిబ్బంది అందజేస్తారన్నారు. బాధిత మహిళల నుంచి ఎవిడెన్స్ రికార్డు చేయటానికి వర్చువల్ ఎవిడెన్స్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన మాట్లాడుతూ.. మహిళల రక్షణ విషయంలో రాజీలేని సేవలందిస్తున్నామన్నారు. మేడ్చల్, బాలానగర్ జోన్‌లను కలుపుతూ స్థానికంగా ఏర్పాటు చేసిన భరోసా సెంటర్‌లో 2022 నుంచి ఇప్పటివరకు 281 కేసులు నమోదయ్యాయని, ఇందులో 194 బాలికలు, 59 మహిళలపై అత్యాచారాలు, 28 వేధింపులకు సంబంధించిన కేసులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ బట్టీలు!

సిరులు పండాల్సిన పంట పొలాల్లో ఇటుక బట్టీలు మండుతున్నాయి. పరిగి డివిజన్‌లో ఎలాంటి అనుమతి లేకుండా కొందరు అక్రమార్కులు ఇటుకలు తయారు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి రూ.లక్షల్లో గండి పడుతోంది. పరిగి, దోమ, కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో వందల సంఖ్యలో ఇటుక బట్టీలు నడుస్తున్నాయి. ఏళ్లుగా ఈ తతంగం జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, వాణిజ్య శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటుక బట్టీలు నడిపించాలంటే మైనింగ్, విద్యుత్ శాఖల అనుమతి పొందాలి. కానీ, అలాంటివేమీ లేకుండా ఉచిత విద్యుత్‌ను వినియోగిస్తూ పరిగి డివిజన్‌లో దాదాపు 50కిపైగా గ్రామాల్లో ఇటుక బట్టీల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.

యథేచ్ఛగా ఇటుకల తయారీ కేంద్రాలు



పరిగి ప్రాంతంలోని ఓ ఇటుకబట్టీ

లైసెన్స్ లేకుండా బట్టీల నిర్వహణ

అనుమతి లేదు.. పన్నూ చెల్లించరు

కోట్లలో వ్యాపారం.. అధికారులకు మామూళ్లు!

ఏటా లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి

పరిగి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో ఇటుక బట్టీల వ్యాపారం కోట్లలో నడుస్తుంది. పరిగి, రంగంపల్లి, రూప్‌ఖాన్‌పేట్, చిగురాల్‌పల్లి, గడిసింగాపూర్, శివారెడ్డిపల్లితండా, గొడుగోనిపల్లి, దోమ, మల్లెపల్లి, దిర్సంపల్లి, బడెంపల్లి, బుద్లాపూర్, కిష్టాపూర్, గుండాల్, దాదాపూర్, కులకచర్ల, అంతారం, పుట్టపహాడ్, చౌడాపూర్ తదితర గ్రామాల్లో ఇటుకబట్టీలు నడుస్తున్నాయి. ఇటుక బట్టీలను రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు అరికట్టాల్సి ఉండగా, రింగ్‌గా ఏర్పడిన వ్యాపారులు మామూళ్లు తడుపుతూ యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి అందాల్సిన రాయల్టీ దక్కడం లేదు. అయితే మైనింగ్, రెవెన్యూ, విద్యుత్ శాఖల నుంచి కింది స్థాయి అధికారులు ఇటుకబట్టీల్లో తనిఖీ చేస్తే,



మిగతా 8వ పేజీలో...

అనుమతి లేని బట్టీలపై చర్యలు



ఇటుక బట్టీలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. అనుమతిలేని ఇటుకబట్టీలపై చర్యలు తప్పవు. బట్టీ ఏర్పాటు చేయాలంటే వ్యాపారులు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలి. అనుమతి లేకుంటే యజమానులపై కేసులు నమోదు చేయిస్తాం.

- ఎం.ఆనంద్‌రావు, తహసీల్దార్, పరిగి

బ్రహ్మోత్సవాలకు సీఎంకు ఆహ్వానం



సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆలయ ధర్మకర్తలు

కొడంగల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ వేంకటేశ్వరస్వామి ఆలయ 45వ వార్షికోత్సవాలు ఈ నెల 24 నుంచి ప్రారంభమై ఏప్రిల్ 3తో ముగియనున్నాయి. ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ ధర్మకర్తలు శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రిక అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్‌గుప్త, రాజేందర్, రత్నం, ప్రశాంత్, ఓంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు సహకరించాలి

» ఆల్ పార్టీ మీటింగ్‌లో కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్త పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు అన్ని పార్టీల ప్రతినిధులు సహకరించాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ అన్నారు. క్రమం తప్పకుండా సమావేశమై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇచ్చిన సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని భారత ఎన్నికల కమిషన్‌కు పంపుతామన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆల్ పార్టీ మీటింగ్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఓటర్లు పెరుగుతున్నారని, అందుకనుగుణంగా బూత్ లెవల్ ఏజెన్సీలను నియమించాలని పార్టీ ప్రతినిధులకు సూచించారు. ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు బూత్‌లలో ఓటరుగా ఉంటే ఫామ్ - 8లో బూత్ మార్పుకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. బూత్‌లను షిఫ్టు చేయడం కష్టమని, పార్టీ ప్రతినిధుల సూచనల మేరకు తాండాలను పరిశీలించి అవసరమైన చోట కొత్త బూత్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏవైనా సందేహాలుంటే తప్పనిసరిగా నివృత్తి చేసుకోవాలని పార్టీ ప్రతినిధులకు సూచించారు. సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చినా పరిష్కరిస్తానని తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

కాగ్నా కలుషితంపై సంయుక్త సర్వే

» ఎన్‌జీటీ ఆదేశాలతో కదిలిన అధికారులు

తాండూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగారు. కాగ్నా నది కలుషితంపై సర్వే చేపట్టారు. నదిలోకి ఎక్కడి నుంచి కలుషిత నీరు వస్తుంది, కలుషితం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో నిర్ధారించేందుకు మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే చేపట్టాయి. తాండూరు కాగ్నా నదిలో కలుషిత జలాలు కలుస్తున్నట్లు తాండూరు సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతోపాటు స్థానికంగా ఒక న్యాయవాది ఎన్‌జీటీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు చిలుక వాగు వెంట సర్వే చేపట్టారు. హైదరాబాద్ రోడ్డు మార్గం నుంచి కోకట్ శివారులోని సర్వే నంబర్లు 36, 39, 41, 47, 48, 52, 53, 57, 58, 59, 62, 63లలో చిలుక వాగు ప్రవహిస్తుంది. ఈ సర్వే నంబర్ల ఆధారంగా నీరు ఎక్కడి నుంచి వస్తుంది, కలుషితం ఎలా అవుతుంది వంటి పలు వివరాలను సేకరించారు. వాగు ప్రవహ మార్గంలో భవనాలు, వెంచర్ల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఇరిగేషన్ డీఈ కిష్టయ్య, తహసీల్దార్ ధారాసింగ్ తెలిపారు. సర్వేలో రెవెన్యూ శాఖ ఆర్ఐ, సర్వేయర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



కొత్తగడి గురుకుల ఘటనపై విచారణ పూర్తి

- భావోద్వేగంతోనే పైఅంతస్తు నుంచి దూకిన విద్యార్థిని
- రాష్ట్ర బీసీ కమిషన్‌కు నివేదికిచ్చిన కలెక్టర్ 7

నాపరాతి గనుల్లో అక్రమ తవ్వకాలు

పరిశీలించిన అధికారులు 8

ఎంత పనికి అంతే కూలి

» డీఆర్డీవో శ్రీనివాస్



సర్వే చేస్తున్న రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు

మోమిన్‌పేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీలో కూలీలు ఎంత పని చేస్తే అంతే కూలి చెల్లిస్తామని డీఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మోమిన్‌పేట్ మండలంలోని చిన్నకొల్కుంద, రావులపల్లి గ్రామాల్లో ఉపాధి పనులు, పశువుల షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. కూలీల హాజరు పట్టికను చూసి గ్రామాల్లో ఎక్కువ మందికి వంద రోజులపాటు పని కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. రోజుకు రూ.300 చొప్పున కూలి డబ్బులు అందించేవిధంగా కొలతలు ఇచ్చి పని చేయించాలన్నారు. వ్యవసాయ భూముల్లోనే కాకుండా వ్యవసాయేతర భూముల్లోనూ పనులు చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పశువుల షెడ్లు నిర్మించుకునేందుకు అవకాశం ఉందని, రైతులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో శంకరయ్య, ఉపాధిహామీ సిబ్బంది గంగయ్య, భుజంగం, వికాస్, గంగయ్య, పంచాయతీ కార్యదర్శి జనార్దన్, కూలీలు పాల్గొన్నారు.

రూ.5.59లక్షలకు తైబజార్ వేలం

కందుకూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతి ఆది వారం నిర్వహిస్తున్న అంగడి తైబజార్‌ను రూ.5.59లక్షలకు గ్రామానికి చెందిన కొమ్మగళ్ల యాదగిరి వేలంలో దక్కించుకున్నారని ఎంపీడీవో, పంచాయతీ ప్రత్యేక అధికారి సరిత తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించగా యాదగిరి అత్యధిక మొత్తం తైబజార్ (అంగడిలో ఫీజు వసూలు) హక్కును దక్కించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో గీత, పంచాయతీ కార్యదర్శి వి.సురేందర్‌గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీలో నిర్వహించిన తైబజార్ వేలంలో పాల్గొన్న గ్రామస్తులు, అధికారులు

ఇక్ఫాయ్‌లో ఘనంగా 'త్రితి' వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

శంకర్‌పల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు 'త్రితి' వంటి కార్యక్రమాలు దోహదపడుతాయని ఇక్ఫాయ్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎల్ఎస్.గణేష్ అన్నారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ కాలేజీలో త్రితి-2025 మూడు రోజుల వార్షిక సాంస్కృతిక సంబరాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మనిషికి విద్యతో పాటుక్రీడలు, సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాలు అవసరమన్నారు. వాటితో సృజనాత్మకత, గుణాత్మకత వెలికి వస్తుందన్నారు.రిజిస్ట్రార్ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు కలిసికట్టుగా పాల్గొనాలని సూచించారు. పలువురు డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన నాబార్డ్ చైర్మన్, ఎమ్మెల్యే



తాండూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నాబార్డు చైర్మన్ షాజీ కేవీతో కలిసి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి సాగునీటి వనరులు, అభివృద్ధి పనుల నిధులపై చర్చించారు. తాండూరు ప్రాంతానికి కావాల్సిన నిధులను నాబార్డు ద్వారా కేటాయిస్తామని ఇందుకు ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యేకు సీఎం సూచించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కందుకూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నేదునూరులో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ధర్మకర్త కాసుల అంజిరెడ్డి ఆధ్వర్యంలో పండితులు రామశర్మ నేతృత్వంలో కల్యాణోత్సవాన్ని మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, సోలిపేట అమరేందర్‌రెడ్డి దంపతులు జరిపించారు. ఈ నెల 23 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని అంజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



రంగారెడ్డి అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నందిగామలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. షాద్‌నగర్ మాజీ కౌన్సిలర్ వేణుగోపాల్ ఆర్థిక సహకారంతో ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేణుగోపాల్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, నాయకులు, గ్రామస్థులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జె.బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రామన్న, హరిజీవన్, సుదర్శన్‌గౌడ్, కుమార్‌గౌడ్, శ్రీకాంత్, నర్సింలు, నాయకులు ఈట గణేష్, కొమ్ము క్రిష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

శివపార్వతుల పరిణయోత్సవం



కేశంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కేశంపేటలోని అమృత లింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. మఠం బసవేశ్వర్-సునంద దంపతులు కల్యాణాన్ని జరిపించారు. కిసాన్‌నగర్ వేద పాఠశాల ఆధ్యాపకుడు సంగయ్య మంత్రోచ్చరణల మధ్య పార్వతీపరమేశ్వరుల కల్యాణ తంతును నిర్వహించారు. లోక కల్యాణార్థం స్వామివారల కల్యాణాన్ని నిర్వహించినట్టు తెలిపారు. వేడుకను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ మంతం చంద్రశేఖర్-చందన, సిద్ధేశ్వర్-పరమేశ్వరి, కోటేశ్వర్-శీర్తి, మహేశ్-శ్రావణి దంపతులు, మాజీ ఎంపీపీ విశ్వానాథం, చిన్న మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.







విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న రాధికాగుప్తా

గురుకులంలో అదనపు కలెక్టర్ తనిఖీ

కీసర, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకిరెడ్డిపల్లి గల జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం అదనపు కలెక్టర్ రాధికాగుప్తా తనిఖీ చేశారు. మధ్యాహ్నం విద్యార్థినులకు వండిన ఆహారాన్ని పరిశీలించి, బాలికలతో కలిసి భోజనం చేశారు. రోజూ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. రుచి, శుచికరమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని విద్యార్థినులకు చెప్పారు.

మీ సేవ కేంద్రం సీజ్

ధారూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ధారూరులోని మీ సేవ కేంద్రంలో వినియోగదారుల నుంచి ఎక్కువ డబ్బు వసూలు చేస్తున్నారని అందిన ఫిర్యాదుతో తహసీల్దార్ సాజిదాబేగం కార్యాలయ అధికారులను పంపి విచారణ జరిపించారు. అక్రమాలు నిజమని తేలడంతో శుక్రవారం మీ సేవ కేంద్రాన్ని సీజ్ చేశారు. ధారూరులోని మీ సేవ కేంద్ర నిర్వాహకులు వినియోగదారుల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుకన్నా అధికంగా వసూలు చేస్తున్నారని దోర్నాల్‌కు చెందిన మహిపాల్, మరికొందరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె ఆర్ఐ స్వప్న, జూనియర్ అసిస్టెంట్ భీంకుమార్‌లను మీ సేవ కేంద్రానికి పంపి విచారణ చేయించారు. నిర్ణీత చార్జి రూ.45కు బదులు రూ.75, ఆధార్ అప్డేట్‌కు రూ.100కు బదులు రూ.150 తీసుకున్నట్టు రుజువైంది. అలాగే కులం, ఆదాయం వివిధ సర్టిఫికెట్ల కోసం చేసుకునే దరఖాస్తుదారుల నుంచీ ఈ మీ సేవ కేంద్రంలో ఎక్కువ డబ్బు తీసుకుంటున్నట్టు ఫిర్యాదులందాయి. దీంతో అధికారులు మీ సేవ కేంద్రాన్ని సీజ్ చేశారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని తహసీల్దార్ తెలిపారు.



మీ సేవ సెంటర్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

కొత్త మండలాలు..

పాత చోటే కార్యాలయాలు

● ఇబ్బందుల్లో ప్రజలు ● పట్టించుకోని పాలకులు

కొత్తూర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలాల పునర్విభజన జరిగి ఏళ్లు గడుస్తున్నా.. పాత మండల కేంద్రాల్లోనే ఆఫీసులు కొనసాగుతున్నాయి. దీంతో అదే దూరాభారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తూర్ మండలంలోని నందిగామ నూతన మండలమైంది. కొత్తూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గతంలో చాకలిదానిగుట్టతండా వద్ద నిర్మించారు. చాకలిదానిగుట్ట తండా నందిగామ మండలంలో ఉంది. అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కొత్తూర్‌కు మార్చలేదు. అలాగే నందిగామ ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయం కొత్తూర్ కార్యాలయ ఆవరణలోని క్వార్టర్స్‌లోనే ఉంది. కార్యాలయాలు పొరుగు మండలాల్లో ఉండడంతో ప్రజలకు కొత్తగా చేకూరే ప్రయోజనమేమీ లేకుండా పోయింది. ఆరోగ్య కేంద్రం కొత్తూరుకు 3కిలోమీటర్లు ఉండడంతో ప్రజలు అక్కడికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కొత్తూర్ మున్సిపాలిటీలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాల్సి ఉన్నా దాన్నీ పట్టించుకునే వారే లేరు. ట్రాన్స్‌కో ఏఈ ఆఫీసు కొత్తూర్‌లో ఉండడంతో నందిగామ మండల ప్రజలు ఇబ్బందులకు గురైతున్నారు. ఏళ్లుగా ప్రభుత్వ కార్యాలయాలు సొంత మండలంలో నిర్మించకపోవడం ఏమిటని, కొత్తగా మండలాలు చేసి ఏం ఉపయోగం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనికి పాలకులే సమాధానం చెప్పాలంటున్నారు.



నందిగామ మండలంలో ఉన్న కొత్తూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బస్తీ దవాఖానాను ఏర్పాటు చేయాలి



కొత్తూర్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ప్రజలకు అందుబాటులో లేదు. పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరం ఉంది. దీంతో ప్రజలు పట్టణంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే కొత్తూర్ మున్సిపాలిటీలో బస్తీ దవాఖానాను ఏర్పాటు చేయాలి.

\- శివకుమార్‌చారి, కొత్తూర్

కరెంటు ఆఫీసును నందిగామకు తరలించాలి



నందిగామ మండలంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. విద్యుత్ కార్యాలయం కొత్తూర్‌లోనే కొనసాగుతోంది. కొత్త మండలం ఏర్పాటైనా విద్యుత్ పనుల కోసం పాత మండల కేంద్రానికే వెళ్లాల్సి వస్తోంది. మరి మాకు దూరం ఏం తగ్గినట్టు? బైకులు, ఆటోల్లో వెళ్లి రావాల్సి వస్తోంది. డబ్బు, సమయం వృథా అవుతున్నాయి. అధికారులు వెంటనే కార్యాలయాన్ని నందిగామకు తరలించాలి.

\- వెంకటేశ్‌గౌడ్, నందిగామ

కొత్తగడి గురుకుల ఘటనపై విచారణ పూర్తి

» భావోద్వేగంతోనే పైఅంతస్తు నుంచి దూకిన విద్యార్థిని

» రాష్ట్ర బీసీ కమిషన్‌కు నివేదికిచ్చిన కలెక్టర్

వికారాబాద్, మార్చి 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్తగడి సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల భవనం మొదటి అంతస్తుపై నుంచి ఓ విద్యార్థిని దూకి గాయపడ్డ ఘటనపై కలెక్టర్ ప్రతీక్‌జైన్ జరిపించిన విచారణ నివేదిక శుక్రవారం తెలంగాణ బీసీ కమిషన్‌కు చేరింది. విద్యార్థిని తబిత చదువుల పరంగా ఒత్తిడి ఎదుర్కోవడం, సహ విద్యార్థినుల ఎదుట విమర్శలకు గురి చేయడం వంటి కారణాలతో భావోద్వేగానికి గురై బిల్డింగ్‌పై నుంచి దూకినట్టు విచారణలో వెల్లడైంది. కొత్తగడి బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మర్పల్లి మండలం కొత్లాపూర్‌నకు చెందిన తబిత ఫిబ్రవరి 24న పాఠశాల మొదటి అంతస్తుపై నుంచి దూకడంతో కాలికి తీవ్ర గాయమైంది. ఉపాధ్యాయులు తనతో అవమానకరంగా మాట్లాడడం వల్లే తబిత ఆత్మహత్యాయత్నం చేసిందనే దూకిందనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. దీనిపై విచారణ చేసి నివేదిక అందజేయాలని తెలంగాణ బీసీ కమిషన్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను ఆదేశించింది. దీంతో విచారణకు కలెక్టర్ ఓ కమిటీని వేశారు. ఈ కమిటీ బృందం ఆత్మహత్యాయత్నానికి దూకడానికి దారితీసిన పరిస్థితులపై మార్చి 4న తబిత విచారణ జరిపింది. విద్యార్థినులు, స్నేహితురాళ్లు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. తబిత మానసికంగా సున్నితమైన విద్యార్థిని, చిన్న విషయానికైనా తీవ్రంగా ప్రతిస్పందిస్తుందని, గతంలోనూ కొన్ని ఘటనల్లో తీవ్రంగా స్పందించిందని విచారణలో గుర్తించారు. పరీక్షలు రాయకపోవడం, రికార్డులు పూర్తి చేయకపోవడం వంటివి జరిగాయని విచారణలో గుర్తించారు. తరచూ క్రమశిక్షణా చర్యలకు గురికావడం, తోటి విద్యార్థినుల ముందు తనను విమర్శించడం వంటి వాటితో అవమానకరంగా భావించేదని గుర్తించారు. ఫిబ్రవరిలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ఓ ఉపాధ్యాయురాలు తన గురించి చెడుగా మాట్లాడినట్లు తెలుసుకున్న తబిత ఆ మరుసటి రోజు ఫిబ్రవరి 24న పాఠశాల పైఅంతస్తు నుంచి దూకిందని నివేదికలో పేర్కొన్నారు. ఘటన జరిగిన వెంటనే సిబ్బంది, టీచర్లు తబితను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారని, అక్కడ ఎక్స్‌రే సదుపాయం లేక ప్రైవేట్ ఆసుపత్రిలో స్కానింగ్ తీయించారని, ఈ విషయమై తబిత తల్లిదండ్రులకు సమాచారమిచ్చారని పేర్కొన్నారు.

కౌన్సెలింగ్ ఇప్పించాలి

సున్నిత మనస్కురాలైన ఇలాంటి బాలికలకు నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించాలని కమిటీ సూచించింది. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఏ జాగ్రత్తలు తీసుకోవాలో సూచనలు చేసింది. విద్యార్థుల ఇబ్బందులను తెలియజేసేలా పాఠశాలల్లో ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేయాలని, బాక్సుల తాళాలు తహసీల్దార్, డీడబ్ల్యూవో కార్యాలయంలోని ఐసీపీఎస్ వద్ద ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. వచ్చే ఫిర్యాదులను సమీక్షించి వాటి పరిష్కారానికి చర్యల కోసం కలెక్టర్లకు తెలియజేయాలని ప్రభుత్వానికి సూచించింది. భావోద్వేగ, మానసిక సవాళ్లను ఎదుర్కొనే విద్యార్థుల కోసం ప్రొఫెషనల్ కౌన్సిలింగ్ సేవలను పొందేలా ఐసీపీఎస్ విభాగంతో పాఠశాలలను సమన్వయం చేయాలని పేర్కొంది. తీవ్ర ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పరిశోధించి దిద్దుబాటు చర్యలు తీసుకునేందుకు అవసరమైన అంతర్గత యంత్రాంగాలను పాఠశాలలు కలిగి ఉండాలని తన నివేదికలో కమిటీ సూచించింది.

ఇందిరమ్మ ఇంటిని 400స్క్వేర్ ఫీట్లలోనే నిర్మించాలి

విస్తీర్ణం పెంచితే బిల్లులు రావు ● హౌసింగ్ డీఈ ఖలీముద్దీన్

తాండూరు రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు 400 స్క్వేర్ ఫీట్ల స్థలంలోనే నిర్మించాలని తాండూరు హౌసింగ్ డీఈ ఖలీముద్దీన్ అన్నారు. శుక్రవారం చెనిగేష్‌పూర్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న మాణెమ్మ, మమత ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. 400 స్క్వేర్ ఫీట్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తే బిల్లు రాదన్నారు. ఇంత మేర నిర్మాణానికే జియో ట్యాగింగ్ చేశామని, ఎక్కువ విస్తీర్ణంలో కట్టుకుంటే ఇబ్బందులొస్తాయని చెప్పారు. లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ వివరాలను తెలియజేయాలని పంచాయతీ కార్యదర్శి వీరేశాన్ని ఆదేశించారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ రహీం ఉన్నారు.



నూతన డ్రగ్‌ను చూపిస్తున్న రవీంద్రయాదవ్

టీబీ నియంత్రణకు ఔషధం

» వికారాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్రయాదవ్

తాండూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): 6 హెచ్‌పీ ఔషధం ఇస్తే జీవితంలో టీబీ సోకదని వికారాబాద్ డిప్యూటీ డీఎంహెచ్ఓ రవీంద్రయాదవ్ అన్నారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని ఆర్ట్ సెంటర్‌లో నూతన డ్రగ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితులకు టీబీ సోకకుండా గతంలో ఆరు నెలలపాటు మందులు వాడాల్సి వచ్చేదని తెలిపారు. ప్రస్తుతం 6హెచ్‌పీ (600ఎంజీ)తో 28 రోజులకు కుదించడం జరిగిందని, ఇది వాడితే టీబీ సోకదని వెల్లడించారు. వ్యాధిగ్రస్తులు ఇక భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సమీవుల్లా, ఫార్మాసిస్టులు రవీకుమార్, రమేష్, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కార్డుల్లో కుటుంబీకులందరి పేర్లూ రావాలి



తాండూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల్లో ఒకరి, ఇద్దరు పేర్లు నమోదు చేయడం ఏమిటని, కుటుంబీకులందరి పేర్లూ రావాలని బీజేపీ అనుబంధ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ సాహు శ్రీలత డిమాండ్ చేశారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వృద్ధులకు, దివ్యాంగులకు పెన్షన్ రావడం లేదని, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, హెల్త్ కార్డులు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే కరెంట్ కోతలే కాదని, పథకాల్లోనూ కోతలే అన్నారు. 24వ వార్డులో 250మందికిపైగా రేషన్ కార్డులకు దరఖాస్తు చేస్తే 45మందికే కార్డులొచ్చాయన్నారు. వాటిలో 31కార్డుల్లో ఒక్కరిపేరే వచ్చిందని, దీన్ని బట్టే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా తెలుస్తోందన్నారు.

భూములు లాక్కుంటే ప్రజా తిరుగుబాటే

తలకొండపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్, ట్రిపుల్ ఆర్, ఫోర్త్ సిటీల పేరుతో ప్రభుత్వం రైతుల భూములు లాక్కునే ప్రయత్నం చేస్తోందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. రైతుల పొలాలు బలవంతంగా తీసుకుంటే ప్రజాతిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. చీపునుంతలలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియంతపాలన చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం భూములు తీసుకుంటే ఎకరానికి రూ.3కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే గ్యారంటీలన్నీ అమలు చేయాలని జైపాల్ డిమాండ్ చేశారు. సమావేశంలో నరోత్తమ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, బాలకుమార్‌గౌడ్, గంప శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బయోచార్ తయారీపై శిక్షణ

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ వర్థాలతో బయోచార్(బొగ్గుపొడి) తయారీపై నేటి(శనివారం) నుంచి రెండు రోజులపాటు శిక్షణ ఇస్తామని పిట్టల అర్గానిక్ ఫా మ్ నిర్వాహకుడు పిట్టల శ్రీశైలం తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్‌లోని పిట్టల ఆర్గానిక్ ఫామ్‌లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ వ్యర్థాలతో బయోచార్ చేసే పద్ధతి రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. దీనివల్ల భూసారం పెరిగి పంటల దిగుబడి సైతం పెరుగుతుందన్నారు. బయోచార్ నిపుణుడు డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి పాల్గొని శిక్షణ ఇస్తారని వెల్లడించారు. రైతులు ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99599 96597, 70187 84740 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

రేపు జిల్లా కాంగ్రెస్ సన్నాహక సమావేశం

» హాజరు కానున్న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

రంగారెడ్డి అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న జిల్లా కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తామని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి శుక్రవారం తెలిపారు. ఆరంగర్‌లోని గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు, సీడబ్ల్యుసీ నేతలు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరవుతారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు, ఎన్‌ఎస్‌యూఐ, యూత్, మహిళా కాంగ్రెస్ నాయకులు హాజరుకావాలని కోరారు.

శంకరస్వాముల పుణ్య సంస్మరణోత్సవం



కెంపిన మఠంలో రుద్రాభిషేకం నిర్వహిస్తున్న చెన్నబసవప్రభుస్వామి

వికారాబాద్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ధర్మాన్ని కాపాడే వారిని ధర్మం కాపాడుతుందని కత్తెపల్లి సచ్చిదానంద షట్‌స్థల పీఠ సంస్థాపకులు ఉమాపతయ్య స్వామి అన్నారు. ఆలంపల్లి కెంపినమఠం పూర్వ పీఠాధిపతి శంకరస్వాముల వార్షిక పుణ్య సంస్మరణోత్సవం శుక్రవారం పీఠాధిపతి చెన్నబసవప్రభు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆగమ పరిషత్ ఉపాధ్యక్షుడు మఠపతి సాంబశివశర్మ నేతృత్వంలో ధ్వజారోహణం, శంకరప్రభు గురు పీఠానికి రుద్రాభిషేకం, పూజాదికాలు నిర్వహించారు. అనంతరం శివానుభవ సత్సంగ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. హిందూ ధర్మం గొప్పదని, సనాతనమైందన్నారు. బసవేశ్వరుడు చూపిన మార్గంలో మనం నడుచుకోవాలన్నారు. తంగెడుపల్లి పీఠాధిపతి శివయోగి శివాచార్యులు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనలో శంకరస్వాములు ప్రత్యేకత నిలుపుకొన్నారన్నారు. చెన్నబసవప్రభు స్వామి మాట్లాడుతూ.. ప్రతొక్కరూ ధర్మాన్ని అనుసరించాలన్నారు. హాజరైన మఠపతి సాంబశివశర్మ, నాగయ్య స్వామి, విరూపాక్ష దేవర శంకరప్రభుస్వాములు హిందూ ధర్మ వైశిష్ట్యాలను, ఆచారాలను వివరించారు. కార్యక్రమంలో వీరశైవ సమాజం అధ్యక్షుడు విజయకుమార్, ఆత్మలింగం, వీరేశ్, మఠం శివానందం, చంద్రశేఖరస్వామి, అశోక్‌స్వామి, పార్వతయ్య, పి.మల్లేశం, విశ్వం పంతులు, విద్యాసాగర్, భద్రప్ప, కోటిలింగం, వీరశైవ, అక్కమహాదేవి సమాజాలు, వీరశైవ యువదళ్ సభ్యులు పాల్గొన్నారు.

రాత్రివేళ డ్రోన్ల చక్కర్లు

చేవెళ్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా రాత్రిపూట డ్రోన్ కెమెరాలు హల్‌చల్ చేస్తున్నాయి. గ్రామాల్లో రాత్రిపూట డ్రోన్ కెమెరాలను ఎగరేస్తున్నారు. చేవెళ్ల, కందవాడ, ఊరెళ్ల, సింగప్పగూడ, కేసారం గ్రామాల్లో రాత్రి 9గంటల సమయంలో డ్రోన్ కెమెరాలను ఎగరేస్తున్నారు. దీంతో ఏం జరుగుతోందని ప్రజలు భయందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఇన్‌స్పెక్టర్ భూపాల్ శ్రీధర్‌ను వివరణిస్తూ.. కందవాడలో ఆర్‌హెచ్ రీసెర్చ్ కంపెనీ నిర్వాహకులు పరిశోధనలో భాగంగా పోలీసు శాఖ నుంచి అనుమతి తీసుకునే డ్రోన్ కెమెరాలతో ఎగరేస్తున్నారని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ పురుషోత్తంరెడ్డి

విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యం

మొయినాబాద్ రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తమ యూనివర్సిటీలో విద్యార్థులను సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దడమే లక్ష్యం అని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి అన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని వర్సిటీ క్యాంపస్‌లో విలేకరులతో మాట్లాడారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ అనుమతులతో తమ డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని వరంగల్ నుంచి హైదరాబాద్‌కు విస్తరించామని తెలిపారు. శనివారం స్నాతకోత్సవానికి నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్విక్‌రెడ్డి, వీసీ శంకర్ లింగం, రిజిస్ట్రార్ రవీందర్, పీఆర్వో రాంబాబు పాల్గొన్నారు.

'మహేశ్వరాన్ని ఫ్యూచర్‌సిటీలో కలిపేలా కృషి'

మహేశ్వరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్‌సిటీలో మహేశ్వరం మండలాన్ని కలిపేలా అసెంబ్లీలో మాట్లాడుతానని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం సబితను కలిశారు. వారితో ఆమె మాట్లాడుతూ.. మహేశ్వరాన్ని మహానగరంగా మారుస్తానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు రెండు గ్రామాలనే ఫ్యూచర్‌సిటీలో కలపడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో చంద్రయ్య, పాండుయాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, నందం, సుధీర్‌గౌడ్, నవీన్, మోతీలాల్ పాల్గొన్నారు.


మేడ్చల్ టౌన్: మేడ్చల్‌లో పరీక్ష కేంద్రం వద్దకు చేరుకుంటున్న విద్యార్థులు


మేడ్చల్ ప్రతినిధి: పరీక్ష కేంద్రం వద్ద పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి విజయకుమారి


బొంరాస్‌పేట్‌లో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు


పరిగి: ఓ పరీక్ష కేంద్రంలో క్యూలైన్‌లో వెళ్తున్న విద్యార్థులు

టెన్త్ ఎగ్జామ్స్ షురూ..

వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో పదో తరగతి పరీక్షలు మొదటి రోజు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30గంటలకు పరీక్ష ఉన్నప్పటికీ 8గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. 8.30 గంటల నుంచే విద్యార్థులకు గేట్ల దగ్గర తనిఖీలు చేసి లోపలికి పంపించారు. పరీక్షకేంద్రాల వద్ద అన్ని సదుపాయాలు కల్పించారు. పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేశారు. మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష జరిగింది. ఎంఈవోలు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. కొన్ని పరీక్షా కేంద్రంలో ఒకరిద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

\- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


కులకచర్ల: బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు


మర్పల్లిలో పరీక్ష కేంద్రం ఎదుట విద్యార్థులు


ఘట్‌కేసర్ రూరల్: కొర్రెముల జిల్లా పరిషత్ పాఠశాలలో హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది


ధారూరు: ధారూరులో పదో తరగతి విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న ఎస్ఐ అనిత


తాండూరు రూరల్: తాండూరులో హాల్‌టికెట్ నంబర్‌ను చెక్ చేసుకుంటున్న విద్యార్థులు


కీసర: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


పెద్దేముల్: మంబాపూర్ పరీక్ష కేంద్రంలో..

తొలిరోజు ప్రశాంతం

(ఐదో పేజీ తరువాయి)

కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు అందుబాటులో ఉంచాలని, టాయిలెట్, విద్యుత్, వైద్య సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పరీక్షలకు వచ్చిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. కేంద్రాల వద్ద అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టాలన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, పరీక్షా కేంద్రాల సిబ్బంది అవసరమైతే డయల్ 100ను సంప్రదించాలని సూచించారు.

మేడ్చల్‌లో జిల్లాలో..

మేడ్చల్ ప్రతినిధి: పదో తరగతి పరీక్షలు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో రెగ్యులర్ విద్యార్థుల కోసం 230, ప్రైవేటు విద్యార్థుల కోసం రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు పరీక్షకు 47,469 మంది విద్యార్థులకుగాను 47,308 మంది హాజరుకాగా, 161 మంది గైర్హాజరయ్యారు. దీంతో 99.66 శాతం హాజరు నమోదైంది. కేంద్రాల వద్ద విద్యార్థులను తనిఖీ చేసిన అనంతరం లోనికి అనుమతించారు. ఈసారి 24 పేజీల బుక్‌లెట్ విధానం అమలులోకి వచ్చింది. ఏప్రిల్ 4న పరీక్షలు ముగియనున్నాయి.

తనిఖీ చేసిన కలెక్టర్, డీఈవోలు

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. పరీక్ష నిర్వహణ తీరును, గదుల్లో విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులను పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్‌కు పలు సూచనలు చేశారు. సజావుగా అన్ని పరీక్షలు జరిగేలా మానిటరింగ్ చేయాలన్నారు. జిల్లా విద్యాధికారి విజయకుమారి పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లాలో మొదటిరోజు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని, పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని తెలిపారు.


వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించిన ఎస్పీ నారాయణరెడ్డి

అక్రమ బట్టీలు

(ఐదో పేజీ తరువాయి)

తర్వాత వెంటనే ఇటుకబట్టీల యజమానులు కార్యాలయాలకు వెళ్లి మామూళ్లు అందిస్తుండడంతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొన్ని చోట్ల పోలీస్ శాఖకు కూడా మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

సారం కోల్పోతున్న భూములు

పంటపొలాల్లో ఇటుకబట్టీల ఏర్పాటుతో సారవంతమైన మట్టి తరలిపోతుండడంతో తవ్విన చోట గుంతలమయంగా మారుతున్నాయి. చాలా గ్రామాల్లో కొందరు రైతులు ఇటుకల తయారీ కోసం వ్యవసాయ భూములను లీజుకు ఇస్తున్నారు. కొందరు రైతులే ఇటుక బట్టీలను నడుపుతున్నారు. అయితే ఇటుకల తయారీలో ఇటుకలను కాల్చడానికి కొందరు బొగ్గును వాడుతుండగా, మరికొందరు సమీపాన ఉన్న అడవిలోని చెట్లను నరికి ఆ కలపను బట్టికి ఉపయోగిస్తున్నారు. దీంతో అడవులు అంతరించి పోతున్నాయి. నియోజకవర్గంలో కొనసాగుతున్న బట్టీల్లో ఎక్కువగా కలపనే వాడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇక్కడ తయారైన ఇటుకలను పట్టణ ప్రాంతాలకు లారీల్లో తరలిస్తూ అక్కడ అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

రూ.6.10 లక్షలకు ధారూరు తైబజార్ వేలం

ధారూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ధారూరు గ్రామం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి అంజానాయక్ తైబజారు వేలం నిర్వహించారు. వేలంలో తైబజారును రూ.6.10లక్షలకు తిమ్మనగర్‌కు చెందిన కొడిగంటి మహేష్ దక్కించుకున్నాడు. గతేడాది ధారూరు తైబజారు 4.08లక్షలకు వేలం పాడగా ఈసారి రూ.1.93లక్షలు అధికంగా పాడారు.

సామాజిక తనిఖీ

కొడంగల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి అధికారులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈనెల 9 నుంచి 19 వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం పర్యటించి పనులను పరిశీలించారు.


వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

నాపరాతి గనుల్లో అక్రమ తవ్వకాలు

- గ్రామస్తుల ఫిర్యాదు
- పరిశీలించిన మైన్స్, రెవెన్యూ అధికారులు

తాండూరురూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తాండూరు మండల పరిధిలోని మల్కాపూర్, ఓగీపూర్, కోటబాస్పల్లి, సంగెంకలాన్ తదితర గ్రామాల్లోని నాపరాతి గనుల్లో లీజు లేకుండా అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని దర్జాగా ఈ తంతు కొనసాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. మల్కాపూర్ గ్రామ శివారులోని సర్వేనెంబర్-72 అసైన్డ్ భూముల్లో కొందరు రాజకీయ పలుకుబడిని ఉపయోగించి అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ఈ సర్వే నెంబర్‌లో 18 ఎకరాల 24గుంటల అసైన్డ్ భూమి ఉంది. అందులో గ్రామానికి చెందిన జెట్టూరు నాగయ్య, కుర్వ మల్లప్పలు అనుమతులు లేకుండానే అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో అదే గ్రామానికి చెందిన తుకారాం ఇటీవల కలెక్టర్, మైన్స్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో శుక్రవారం తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ, ఏజీ లక్ష్మీకాంతం తన సిబ్బందితోపాటు తాండూరు రెవెన్యూ అధికారులు ఆర్ఐ గోపి, సర్వేయర్ మహేష్ బృందంతో వచ్చి నాపరాతి గనులను పరిశీలించారు. సర్వేనెంబర్-72లో నాపరాతి తవ్వకాల కోసం మల్కాపూర్‌కు చెందిన జెట్టూరు నాగయ్య భార్య మల్లమ్మ, కుర్వ మల్లప్ప తరపున కుర్వ జగ్గప్పలు లీజుల కోసం 24 సెప్టెంబర్ 2024లో లీజు కోసం దరఖాస్తు చేసుకోగా, వారికి ఈనెల 20న అనుమతి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ విషయంపై ఏకీభవించని గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి, అరవింద్‌రావు, తుకారాం, అనిల్, రాజు, నరేష్, చిరంజీవిలు మైన్స్ ఏడీ సత్యనారాయణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జెట్టూరు నాగయ్య మృతి చెందాడని, ఆయన భార్య మల్లమ్మ పేరిట లీజు ఇవ్వడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన కుర్వ మల్లప్ప సర్వేనెంబర్-72లో 2ఎకరాల 4గుంటల భూమిలో తవ్వకాలు జరుపుతున్నారని, ప్రస్తుతం మల్లప్ప మృతి చెందారని, ఆయన భార్య కూడా మృతి చెందిందని, వారికి వారసులు కూడా లేరని, వారి బంధువు అయిన జగ్గప్ప పేరిట లీజులు ఇవ్వడం ఏమిటని ఏడీపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని స్థానికులు హెచ్చరించారు.


గనిని పరిశీలిస్తున్న మైన్స్ ఏడీ సత్యనారాయణ

సంక్షిప్తంగా..

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ధారూరు: ధారూరు స్కూల్ కాంప్లెక్స్‌లో శుక్రవారం శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఐదు పాఠశాలలు పాల్గొనగా ప్రథమ స్థానంలో నాగారం, ద్వితీయ స్థానంలో ధారూరు, స్టేషన్ ధారూరు ప్రాథమిక పాఠశాలల జట్లు నిలిచాయి. క్విజ్ విజేతలకు నిర్వాహకులు ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మేకవనంపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యాశాఖ, శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో టేకులపల్లి పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి, అమ్రాదికలాన్ పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించారు సాధించారు.

బడుగులకు న్యాయం చేయడమే ధ్యేయం

ఘట్‌కేసర్/కులకచర్ల: బడుగులకు న్యాయం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణనకు అసెంబ్లీలో ఆమోదం పొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఘట్‌కేసర్, నారపల్లిలో భారీ ర్యాలీలు నిర్వహించి అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కులకచర్ల మండల కేంద్రంలోని చౌరస్తాలో రాజీవ్ యువ వికాసం పథకంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్య ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ

దుద్యాల/బొంరాస్‌పేట్: అలిమ్ కో కంపెనీ బెంగళూర్ వారి ఆధ్వర్యంలో దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేసినట్లు ఐఈఆర్పీ రామ్‌శ్రీనివాస్‌బాబు తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన నలుగురికి వీల్‌చైర్‌లతో పాటు రోలెటర్స్ క్లచెస్‌ను పంపిణీ చేశారు. అదేవిధంగా బొంరాస్‌పేట్ మండలంలోని 23 మంది దివ్యాంగులకు ట్రై సైకిల్, బ్యాటరీ సైకిల్, హియరింగ్ హెడ్స్ తదితర పరికరాలను ఉచితంగా అందజేశారు.

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం

కొడంగల్ రూరల్: కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ బి.విజయ్‌కుమార్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు సరికాదు

తాండూరు: పీడీఎస్‌యూ, సీఐటీయూ నాయకులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మహాధర్నాకు పిలుపునిస్తే ముందస్తు అరెస్టులు చేయడం సరికాదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్‌లు అన్నారు.

సీసీరోడ్డు పనుల ప్రారంభం

చౌడాపూర్: వెంకటాపూర్‌లో రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏల్పాటి అశోక్‌కుమార్ శుక్రవారం అధికారులు మాణిక్‌కుమార్, శివకుమార్‌లతో కలిసి ప్రారంభించారు.

ఘనంగా పాంబండ జాతర ఉత్సవాలు

కులకచర్ల: బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శకటోత్సవము (బండ్ల తిరుగుట) కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, అర్చకులు దగ్గరుండి కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 30 వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి.

బెట్టింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు

మోమిన్‌పేట్: ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని మోమిన్‌పేట్ సీఐ వెంకట్ హెచ్చరించారు. బెట్టింగ్‌కు పాల్పడే వారి వివరాలను డయల్ 100కు లేదా 8712670036 నెంబర్‌లకు సమాచారం అందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు.

అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేపడితే చర్యలు

బషీరాబాద్: అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడితే శాఖపరమైన చర్యలు తప్పవని బషీరాబాద్ ఎంపీవో జయకర్ హెచ్చరించారు. కంసాన్‌పల్లి(ఎం) గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్: మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో 6, 7, 8 తరగతుల్లో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగేశ్ శుక్రవారం తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని, పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్‌లు ఏప్రిల్ 15న డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

తల్లిని కొట్టిన కుమారుడికి ఏడాది జైలు

దోమ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కన్నతల్లిని కొట్టిన ఘటనలో కుమారుడికి ఏడాది జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ పరిగి కోర్టు న్యాయమూర్తి నాగుల శిల్ప తీర్పునిచ్చినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లా దోమ మండలంలోని ఊటుపల్లికి చెందిన సబేరా బేగం, భర్త ఉస్మాన్ ఇంట్లో ఉండగా 2024 సెప్టెంబరు 6న కుమారుడు మొహ్మద్ అజీమోద్దీన్ భార్య నాజియా బేగం ఇంట్లో కనిపించకపోవడంతో తన భార్యను ఏమైనా అన్నారా? ఎందుకు వెళ్లిపోయిందని తల్లి సబేరా బేగంను కొట్టాడు. దీంతో తల్లి సబేరాబేగం ఎడమ చేయి విరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అజీమోద్దీన్‌ను రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తు చార్జిషీట్‌ను పరిగి కోర్టులో సమర్పించగా శుక్రవారం న్యాయమూర్తి నాగులశిల్పా వాదోపవాదాలు విన్న తర్వాత నిందితుడు అజీమోద్దీన్‌కు సంవత్సరం పాటు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

గ్రామ దేవతల విగ్రహాల ధ్వంసం

పరిగి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామంలోని మైసమ్మ, పోచమ్మ ఆలయాల్లో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు అమ్మవార్ల ప్రతిమలను ధ్వంసం చేశారు. శుక్రవారం ఉదయం గమనించిన గ్రామస్తులు విగ్రహాల ధ్వంసం గురించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇంట్లో చొరబడి పుస్తెలతాడు అపహరణ

బొంరాస్‌పేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు అపహరించుకెళ్లారు. ఈ ఘటన బొంరాస్‌పేట్ మండలంలో జరిగింది. తుంకిమెట్ల గ్రామానికి చెందిన వడ్ల శేఖర్‌చారి ఇంట్లో వడ్ల సుష్మిత ఒంటరిగా ఉండగా శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారు. గుర్తుతెలియని స్ప్రేకొట్టి అపస్మారక స్థితిలోకి వెళ్లాక మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడు అపహరించుకెళ్లినట్లు బాధితురాలు వాపోయింది. అపహరణకు గురైన పుస్తెలతాడు రెండున్నర తులాలు ఉంటుందని తెలిపారు. ఈ ఘటనపై వడ్ల శేఖర్‌చారి బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ గ్రామానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మూడుచింతలపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గత వారం రోజుల నుంచి తూంకుంట మున్సిపాలిటీలోని వెంకటేశ్వర కాలనీలో గుర్తు తెలియని మతిస్థిమిత్తం లేని వ్యక్తి చొక్కా మరియు చెప్పులు లేకుండా సంచరిస్తున్నాడని కాలనీవాసులు విచారించగా అతనికి మతిస్థిమిత్తం లేదని గుర్తించారు. కాగా శుక్రవారం వెంకటేశ్వర కాలనీలోని ఒక ఓపెన్ వెంచర్‌లో అతను చనిపోయి ఉన్నాడని కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారించగా గత వారం రోజుల నుంచి తిండి, నీరు లేక వడదెబ్బ వలన చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాండూరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీర్‌శెట్టిపల్లి గ్రామశివారులోని కాగ్నానదిలో రెండు ఇసుక ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఈవిషయమై గ్రామస్తులు కరన్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడికి చేరుకుని రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. అగ్గనూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఫిరోజ్, కుర్వ శేఖర్‌లు వేర్వేరు ట్రాక్టర్లపై ఇసుక లోడ్‌తో వస్తుండగా పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ఇసుక ట్రాక్టర్లను గ్రామస్తుల సమక్షంలో పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రెండు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

గోడ కూలడంతో కార్మికులకు గాయాలు

కీసర రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గోడ కూలడంతో ముగ్గురు కార్మికులకు గాయాలైన ఘటన శుక్రవారం కీసర పోలిస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసర సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలోని పటేల్ ఫామ్‌హౌజ్‌లో పనిచేస్తున్నారు. కాగా అక్కడ పని చేస్తున్న కార్మికులపై పక్కనే గోడ కూలింది. దీంతో కార్మికులు బస్వప్ప, శరణప్ప, లక్ష్మన్‌లకు గాయాలయ్యాయి. తోటి కూలీల ద్వారా సమాచారం అందుకున్న 108సిబ్బంది అక్కడికి చేరుకుని, వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బస్వప్ప పరిస్థితి విషమంగా ఉండగా మిగతా వారికి ఒకరి కాలు, మరొకరికి పక్కటెముకలు విరిగినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


కోట్‌పల్లిలో ఆశావర్కర్ల నిరసన

కోట్‌పల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోట్‌పల్లి పీహెచ్‌సీ వద్ద శుక్రవారం ఆశావర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు అమృత, యాదలక్ష్మి, సుమిత్ర, రత్నమ్మ పాల్గొన్నారు.

తాండూరు: పట్టణంలోని పీహెచ్‌సీ శుక్రవారం సమస్యలు పరిష్కరించాలంటూ కోరుతూ ఆశావర్కర్లు నిరసన చేపట్టారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ.18వేలు, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణుకా, అనితపాల్గొన్నారు.

కీసర: ఆశావర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎదుట ఆశావర్కర్లు నిరసన చేపట్టారు. సంఘం నాయకురాళ్లు జయప్రద, రాధలు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై ఫోకస్

ఘట్‌కేసర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను వసూళ్లపై ఘట్‌కేసర్ మున్సిపల్ అధికారులు దృష్టిపెట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మున్సిపల్ బిల్‌కలెక్టర్లు ఇళ్ల వద్దకు వెళ్లి ట్యాక్సుల వసూళ్లలోనే నిమగ్నమవుతున్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలో 12,500 ఇళ్లున్నాయి. మొత్తం 9.71కోట్ల పన్నులు రావాల్సి ఉంది. ఇందులో పాతబకాయిలు 3.64కోట్లున్నాయి. ఇప్పటి వరకు 53శాతమే పన్నులు వసూలయ్యాయి. ఆర్థిక సంవత్సరం ముగింపునకు కేవలం వారంరోజులే మిగిలి ఉండటంతో వసూళ్ల కోసం మరింత వేగం పెంచారు. పన్నులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసేవారి డ్రైనేజీలను బ్లాక్‌చేస్తూ పన్నులను రాబట్టుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.